నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | KARIMNAGAR

నేడు కరీంనగర్‌కు హరీశ్‌రావు

బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ తరపున ఇంటింటా ప్రచారానికి రాక

కరీంనగర్, ఏప్రిల్11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ దూసుకెళ్తున్నది. అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించిన గులాబీ పార్టీ, క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింతగా చేరువవుతున్నది. కలిసొచ్చిన కరీంనగర్ గడ్డ నుంచే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గత నెల 12న కదనభేరి పేరిట శంఖారావం పూరించగా, మరోవైపు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. ఇటు ఎంపీ అభ్యర్థులు కూడా ప్రజల మద్దతు కూడ కడుతుండగా.. హరీశ్‌రావు నేడు కరీంనగర్ వస్తున్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ తరపున శుక్రవారం సాయంత్రం 5గంటల నుంచి ఇంటింటా ప్రచారం చేయనున్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో వైఫల్యాలను, ఆరు గ్యారెంటీల పేరిట చేసిన మోసాన్ని, సాగునీరు లేక రైతులు పడుతున్న గోసలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించనున్నారు. బీజేపీ పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ అభివృద్ధిని మరిచిన తీరును, ఎంపీగా ఉన్నప్పుడు వినోద్ కుమార్ చేసిన అభివృద్ధిని వివరించనున్నారు. అలాగే పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఆదర్శంగా మారిన తీరును కండ్లముందుంచి, ఓట్లు అభ్యర్థిస్తారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

డెడ్ స్టోరేజీకి చేరువలో ఎల్ఎండీ

కరీం'నగరానికి' తలాపునే ఉన్న దిగువ మానేరు డ్యాం (ఎల్ఎండీ)లో నీరు డెడ్ స్టోరేజీకి చేరువవుతున్నది. మొత్తం 24 టీఎంసీలకు గానూ డెడ్ స్టోరేజీ 2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 5.7 టీఎంసీలు మాత్రమే నీరున్నది. రోజురోజుకూ నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుండడం భయపెడుతున్నది. బుధవారం ప్రాజెక్టు గేట్లు తేలాయి. ఏప్రిల్ రెండో వారంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. మున్ముందు డ్యాం ఎండిపోయే ప్రమాదం కనిపిస్తున్నది. ఇప్పటికే నగరంలో తాగునీటి తిప్పలు మొదలు కాగా, రాబోయే రోజుల్లో ఈ సమస్య తీవ్రమయ్యే ముప్పు ఉన్నదని ప్రజానీకం ఆందోళన చెందుతున్నది.

- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ముస్లింలంటే ఇంత చిన్నచూపా..?

- రంజాన్‌కు కనీసం తోఫాలు ఇవ్వరా..
- కాంగ్రెస్‌పై పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ధ్వజం

వెల్గటూర్: శాఖాపూర్‌లో కొప్పుల ఈశ్వర్‌కు దట్టి కడుతున్న ముస్లింలు

వెల్గటూర్/ వెల్గటూర్, ఏప్రిల్ 11: ముస్లింలపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. రంజాన్ పండుగ సందర్భంగా కనీసం తోఫాలు కూడా ఇవ్వరా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అంతా అస్తవ్యస్తంగా మారిందని, నాలుగు నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని మతాలను సమానంగా చూసి, ముస్లింలకు పెద్ద పీట వేసి, అండగా నిలిచిన గొప్ప నాయకుడు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. ఆయన ఆదేశాల మేరకు పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నానని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం వెల్గటూర్ మండలం శాఖాపూర్, గొల్లపల్లి మండలం చిల్వకొడూర్‌తోపాటు పెద్దపల్లిలోని చందపల్లిలో ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మతపెద్దలు కొప్పులకు దట్టి కట్టి, ఆశీర్వదించారు. అనంతరం ధర్మపురిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఆయన మాట్లాడారు. ముస్లింల అభ్యున్నతికి నిధులు కేటాయించడంతోపాటు ఇమామ్‌ల జీత, భత్యాలు పెంచిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. ఇంకా రంజాన్ మాసంలో ముస్లింలకు 'తోపా' అందించిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ విస్మరించిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. రైతులకు సాగు నీరు ఇవ్వకుండా, రైతు బంధు, రుణమాఫీ, పంటకు రూ.500 బోనస్ హామీలను గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో ఎక్కడ కూడా ఒక్క ఎకరం ఎండిపోకుండా నీళ్లందించామ ని, సంవత్సరానికి కోటి 20లక్షల ఎకరాల్లో పంటలు పండించుకున్నామని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ పాలనలో సాగునీరందక యాసంగిలో పంటలు ఎండిపోతుయని ఆవేదన చెందారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన ₹200కోట్ల నిధులను కాంగ్రెస్ సర్కారు రద్దు చేసిందని తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ తన ఆస్తుల గురించి మాట్లాడడం సరికాదని సూచించారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల లెక్క చెప్పానని, అవిగాక ఏమైనా ఉంటే ఆధారాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు వేణు, యూనుస్, కార్పొరేట్ నాయకులు అయ్యోరి రాజేశ్‌కుమార్, చిలివేరి శ్యాంసుందర్, అక్కనపల్లి సునీల్‌కుమార్, సంగి శేఖర్, అనంతుల లక్ష్మణ్, దుర్గం రవి, అవునూరి శ్రీకాంత్, గడ్డం బాలరాజు తదితరులున్నారు.

ఏటీఎంలో చోరీ చేసి.. హర్యాణాలో పంచుకొని..

- సినిమా సీన్‌ను తలదన్నేలా హుజూరాబాద్‌లో దొంగతనం
- గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం ధ్వంసం
- ₹8.64 లక్షలతో ఉడాయింపు
- ఇదీ అంతర్రాష్ట్ర దొంగల ముఠా చోరీకి పాల్పడిన తీరు • ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, ఏప్రిల్ 11 : హుజూరాబాద్ ఏటీఎంలో చోరీ చేసిన దొంగలు దొరికారు. సినిమా సీన్‌ను తలదన్నేలా స్కెచ్ వేసి దొంగతనం చేసినా.. తప్పించుకోలేకపోయారు. ఇక్కడ ₹8.64 లక్షలు ఎత్తుకెళ్లి, హర్యాణాలో పంచుకోగా.. ఎట్టకేలకు పోలీసులు నిందితుల్లో ఒకరిని పట్టుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలను హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ జీ వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన తారీఫ్‌కు లారీ ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీస్ ఉన్నది. ఆయనకు సొంతంగా లారీ కంటెయినర్ (ఆర్‌జే 11 జీబీ 7370) కూడా ఉన్నది. హర్యాణాకు చెందిన అన్నదమ్ములు సపత్, ముషారఫ్ రాజస్థాన్‌లోనే లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాజిద్ కూడా అక్కడే వెల్డింగ్ పనులు చేస్తుండగా, వీరంతా ఎక్కడైనా ఏటీఎంలో చోరీ చేయాలని అనుకున్నారు. అందుకు ముందుగానే అంతా ప్లాన్ సిద్ధం చేసుకున్నారు. అక్కడే లేబర్లుగా పనిచేస్తున్న ఢిల్లీకి చెందిన ఆఫ్తాబ్, హర్యాణాకు చెందిన ఫరీద్‌ను సహాయకులుగా తీసుకున్నారు. అనుకున్నట్టుగానే ఈ నెల 17న ఈ ఆరుగురు రాజస్థాన్ నుంచి విజయవాడకు గ్యాస్ స్టవ్‌ల లోడ్‌తో వెళ్లి, తిరిగి ఈ నెల 18న వరంగల్ మీదుగా హుజూరాబాద్‌కు చేరుకున్నారు. పరకాల క్రాస్‌రోడ్ వద్ద ఉన్న రాజస్థాన్ దాబాలో భోజనం చేశారు. అప్పటికే దొంగలించిన మోటర్ సైకిల్, మారుతీ కారులో తిరుగుతూ.. ఏటీఎంలో చోరీ చేసేందుకు అర్ధరాత్రి దాకా రెక్కీ నిర్వహించారు. కోర్టు సమీపంలో ఉన్న ఏటీఎంలో చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. తెల్లవారుజామున మూడు గంటలకు ఆ ఏటీఎం వద్ద ఆఫ్తాబ్ కాపలాగా ఉండగా.. ఫరీద్ సీసీ కెమెరాలపై బ్లాక్ కలర్ స్ప్రే చేశాడు. ఆ తర్వాత సపత్, సాజిద్ గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను పగులకొట్టి, అందులో ఉన్న ₹8,64,100 కొల్లగొట్టారు. అప్పటికే తుమ్మనపల్లి వద్ద కంటెయినర్‌తో సిద్ధంగా ఉన్న ముషారఫ్ దగ్గరకు వెళ్లి, మోటర్‌సైకిల్, కారును అక్కడే వదిలేశారు. తర్వాత అందరూ కలిసి కంటెయినర్‌తో హర్యాణాకు వెళ్లి.. దొంగిలించిన సొమ్మును పంచుకున్నారు. ఈ ఘటనపై ఏటీఎం కేంద్రాల్లో పనిచేస్తున్న హైదరాబాద్‌కు చెందిన తేలుకుంట్ల శ్రీనివాస్‌చారి ఫిర్యాదు చేయగా..పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు. పట్టణ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం సభ్యులు రంగంలోకి దిగారు. చోరీ చేసిన తీరును బట్టి ఇది అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనేనని అనుమానించారు. ఆ మేరకు కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హైదరాబాద్, కామారెడ్డి తదితర ప్రాంతాల్లో వెతికారు. ఆ ప్రాంతాల్లో సీసీ పుటేజీలను పరిశీలించారు. కామారెడ్డి ప్రాంతంలో కంటెయినర్‌తో వ్యక్తి అనుమానాస్పదంగా ఉండడాన్ని గమనించారు. అది కరీంనగర్‌వైపు వెళ్లినట్లు గుర్తించి ఆ నంబర్‌ను నోట్ చేసుకున్నారు. ఈ సమాచారం మేరకు బుధవారం కరీంనగర్ బైపాస్ (ఎన్టీఆర్ చౌరస్తా)లో కంటెయినర్ వాహనాలను తనిఖీలు చేస్తుండగా.. హైదరాబాద్ వెళ్తున్న ఆ కంటెయినర్‌ను ఆపి, తనిఖీ చేశారు. అనుమానంతో డ్రైవర్ ముషారఫ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీ చేసింది తామేనని ఒప్పుకోవడంతో అరెస్ట్ చేశారు. త్వరలోనే మిగతా వారిని పట్టుకుంటామని ఏసీపీ స్పష్టం చేశారు. సమావేశంలో టౌన్ సీఐ రమేశ్, ఎస్ఐ సాంబయ్య, ఐడీ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే కొనుగోళ్లలో జాప్యం

ధాన్యాన్ని పరిశీలిస్తున్న కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్

- ప్రభుత్వం ఎప్పుడు కొంటుందో తెలియకే మిల్లులకు ధాన్యం
- రైతులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్రాలు ఓపెన్ చేయాలి
- క్వింటాల్‌కు ₹500ల చొప్పున బోనస్ ఇవ్వాలి
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

మల్యాల, ఏప్రిల్ 11 : ఎన్నికల సమయంలో ధాన్యం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పుడు ఇవ్వాల్సి వస్తుందనే కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నదని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరి వల్లే రైతులు ప్రైవేట్ డీలర్లకు, నేరుగా రైస్‌మిలర్లకు అమ్ముకుని నష్టపోతున్నారని ఆవేదన చెందారు. బోనస్ మాట దేవుడెరుగు.. కనీసం మద్దతు ధరనైనా రైతులకు దక్కేలా కొనుగోలు కేంద్రాల్లో త్వరితగతిన ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేశారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, స్థానిక నాయకులతో కలిసి మల్యాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమై కొనుగోలు కేంద్రాల్లోకి ధాన్యం వస్తున్నదని, అయినా కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. గ్రామాల్లో ధాన్యం కుప్పలు పోసి ఎప్పుడు కొంటారో తెలియక దళారులను ఆశ్రయిస్తున్నారని, క్వింటాల్ రూ. 1800కే అమ్ముకొని నష్టపోతున్నారని ఆవేదన చెందారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. రైతులపై ప్రేమ ఉన్నా వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని, ధాన్యానికి తక్షణమే క్వింటాల్‌కు ₹500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మల్యాలలో కొత్తగా నిర్మించిన ముత్యాల పోచమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత మానాల, మ్యాడంపల్లి , తక్కల్లపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండపలుకుల రాంమోహన్‌రావు, వీర్ల వెంకటేశ్వర్‌రావు, మిట్టపల్లి సుదర్శన్, జనగం శ్రీనివాస్, బోయినపల్లి మధుసూదన్‌రావు, అయిల్నేని సాగర్‌రావు, కొరండ్ల నరేందర్‌రెడ్డి, సుభాన్, నేళ్ల రాజేశ్వర్‌రెడ్డి, తైదల శ్రీలత, ఎడిపల్లి అశోక్, బుచ్చయ్య, శివకుమార్, రియాజ్, బీరయ్య, వేణురావు, విష్ణు, రవివర్మ, శ్రీనివాస్, నలువాల సంజీవ్, చీకట్ల అశోక్, కుమార స్వామి, శంకర్, లక్ష్మణ్, మహేశ్ పాల్గొన్నారు.

రైతుల పక్షాన దీక్షలు చేస్తే కేసులా..?

- కాంగ్రెస్ మళ్లీ భయభ్రాంతులకు గురి చేస్తున్నది
- పూలేను అవమానించిన చరిత్ర ఆ పార్టీది
- అట్టడుగుకులాల రాజ్యాధికారమే ధ్యేయంగా మందుకు సాగుతా
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాల వేసి నమస్కరిస్తున్న పుట్ట మధూకర్

మంథని, ఏప్రిల్ 11: కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, సాగునీరు లేక పంటలు ఎండుతున్న రైతుల పక్షాన దీక్షలు చేస్తే కేసులు పెట్టిస్తున్నారని పెద్దపల్లి జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ మండిపడ్డారు. సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబా పూలేను అవమానించిన చరిత్ర ఆ పార్టీదని విమర్శించారు. తనకు కుర్చీలు, అధికారం ముఖ్యం కాదని, మంథని నియోజకవర్గంలో అధికంగా ఉన్న జాతులకు రాజ్యాధికారం తీసుకు రావాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం మంథనిలో పూలే 197 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంథనిలో పూలే విగ్రహానికి పుట్ట మధూకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ అంటేనే మహనీయుల మాసంగా పిలుస్తారని, ఈ నెలలోనే దొడ్డి కొమురయ్య, బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయులు జన్మించారన్నారు. సమాజం కోసం జీవితాలను త్యాగం చేసిన వారిని స్మరించుకోవడం మనందిరి బాధ్యత అని చెప్పారు. మహనీయుల చరిత్రను ఇంకా తెలుసుకోవడంతో పాటు సమాజానికి కూడా తెలియజేసేలా మహనీయుల స్ఫూర్తి దీక్ష తీసుకున్నట్లు తెలిపారు. ఈ దీక్షను ప్రత్యేక డ్రెస్ కోడ్‌లో ఉంటూ ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగిస్తామని, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. పూలే, అంబేద్కర్ చరిత్ర తెలియకపోవడం వల్లే మంథని నియోజకవర్గంలో అధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇంకా బానిసలుగా ఉన్నారని, దీని వల్ల 3 శాతం ఓట్లు ఉన్న ఒకే కుటుంబం రాజ్యమేలుతుందన్నారు. పూలేతోపాటు అంబేద్కర్, కుమ్రం భీం మహనీయుల విగ్రహాలను పెట్టకుండా పోలీస్‌స్టేషన్‌లో పెట్టించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని మండిపడ్డారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని, అధికారులు వాటిని పట్టించుకోకుండా ఇలా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. తమకు కూడా రాజ్యాంగంలో ఉన్న హక్కుల గురించి తెలుసనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తగరం సుమలత, బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేశ్, తగరం శంకర్‌లాల్, ఎగోలపు శంకర్ గౌడ్, పూదరి సత్యనారాయణ, పెగడ శ్రీనివాస్, మందల రాజిరెడ్డి, అత్తె చంద్రమౌళి, గొబ్బూరి వంశీ పాల్గొన్నారు.

మధురానగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కాంగ్రెస్‌కు ఓట్లడిగే అర్హత లేదు

- గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల వద్దకు వెళ్లగలరా..?
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 11 : అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లడిగే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరో తెలియకుండానే మంత్రి పొన్నం ప్రభాకర్ కొండగట్టు అంజన్నకు ముడుపులు కట్టడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. గంగాధర మండలం మధురానగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ప్రజలను ఓట్లు అడుగుతామన్నారు. కానీ, ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల వద్దకు వెళ్లగలరా..? అని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంట్ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చాడో చెప్పి ఓట్లడగాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఏమీ చేయలేదని పొన్నం మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీని, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌ను, జాతీయ రహదారులను, చొప్పదండికి సైనిక్ స్కూల్‌ను తీసుకువచ్చిన ఘనత వినోద్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు వేముల అంజి, రామిడి సురేందర్, దూలం శంకర్‌గౌడ్, వడ్లూరి ఆదిమల్లు, దోమకొండ మల్లయ్య, సామంతుల శ్రీనివాస్, సముద్రాల అజయ్, గంగాధర కుమార్, ద్యావ సంజీవ్, గడ్డం స్వామి, గంగాధర మోహన్, తూం రవి పాల్గొన్నారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్



కరీంనగర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రంజాన్ మాసం చివరి రోజు గురువారం ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ చదివి వినిపించగా, ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

- కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 11

రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేసి నినదిస్తున్న ఎమ్మార్పీఎస్ అఖిలపక్ష నాయకులు

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం

ఎమ్మార్పీఎస్ అఖిలపక్ష నాయకులు

జగిత్యాల రూరల్, ఏప్రిల్11 : తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క టికెట్ కూడా కేటాయించకుండా కాంగ్రెస్ అవమానిందని ఎమ్మార్పీఎస్ అఖిల పక్షనాయకులు నాయకులు మండిపడ్డారు. తమ ఆత్మాభిమానాన్ని దెబ్బతీసిన ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు టికెట్లు ఇవ్వకపోవడంపై ఎమ్మార్పీఎస్ అఖిలపక్షం ఆధ్వర్యంలో గురువారం జగిత్యాలలో నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహం వద్ద రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ అంటేనే మాలల పెత్తనం, రెడ్డి రాజ్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల వ్యతిరేకి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మహాజన్ సోషలిస్ట్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు దూమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బొల్లి అనిల్, రామస్వామి, జిల్లా అధికార ప్రతినిధి సతీశ్ పాల్గొన్నారు.